# అమ్మకు బహుమతి





## సింహప్రసాద్

కథలు

**Ammaku Bahumati**
**Anthology of Short Stories**
By **Simha Prasad**

e-mail : simhaprasad9@gmail.com

© **రచయిత**

ప్రథమ ముద్రణ : జనవరి,**2019**

వెల : **₹ 80/-**

డి.టి.పి., ముఖచిత్ర డిజైన్ : సాంబశివరావు

---

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితం.**
**పుస్తకంలోని అభిప్రాయాలు రచయిత సొంతం. వాటిలో విశ్వ విద్యాలయానికి ఎటువంటి బాధ్యత లేదు.**

---

ప్రింటర్స్ : **కర్షక్ ప్రింటర్స్**
విద్యా నగర్, హైదరాబాద్. ఫోన్ : 9866661478

ప్రతులకు :

**అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు**

మరియు

**Sri Sri Prachuranalu**
401, Mayuri Estates,
Near Temple Bus stand,
KPHB, Hyderabad - 500 085.
Cell : 98490 61668

# కథాక్రమం

| | | |
|---|---|---|
| 1. | సంకటం | 9 |
| 2. | అభిలాష | 18 |
| 3. | గోదానం | 21 |
| 4. | చిరుత | 32 |
| 5. | నిర్వాసితులు | 39 |
| 6. | పైకప్పు | 42 |
| 7. | మనుగడ | 50 |
| 8. | నాన్నకు థాంక్స్ | 59 |
| 9. | ఆకుపచ్చ సూరీడు | 72 |
| 10. | అమ్మకు బహుమతి | 79 |
| 11. | అనుకంప | 86 |
| 12. | చాలు | 90 |
| 13. | దాహార్తి | 97 |
| 14. | ఎంత పచ్చనిది ఈ చిన్ని ప్రపంచం | 104 |
| 15. | గర్భగుడి | 110 |
| 16. | జయహో | 119 |
| 17. | జీవనయాగం | 128 |
| 18. | ఒక మరణం -ఒక చావు | 142 |
| 19. | పారా హుషార్ | 154 |
| 20. | అనుబంధం | 160 |

# సంకటం

మూడు రోజుల్నుంచి తుపాను తీరప్రాంతాన్ని అతలాకుతలం చేస్తోంది.

వర్షం ఎడతెరిపిలేకుండా కుండపోతగా కురుస్తోంది. గాలి పిచ్చెత్తినట్టు ప్రచండవేగంతో వీస్తోంది.

గుడిసెలు ఎగిరిపోతున్నాయి. చెట్లు కూలిపోతున్నాయి. రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమయింది. ఇక కమ్యూనికేషన్ పూర్తిగా ధ్వంసమైంది.

ముందస్తు రక్షణ చర్యగా తీరప్రాంత వాసుల్ని రక్షణ శిబిరాలకు తరలించింది ప్రభుత్వం. తుఫాను షెల్టర్లలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు జనం.

కేవలం రెండువందల మందికోసం ఏర్పాటు చేయబడిందా షెల్టరు. కాని మూడొందల మందిదాకా జనం కిక్కిరిసి ఉన్నారు. వారిలో అన్ని వయసుల వారూ ఉన్నారు. ఆడా మగా పిల్లా పీచూ అంతా ఉన్నారు. వద్దన్నా వినకుండా కొందరు కుక్క, కోడి లాంటి పెంపుడు జీవాల్నీ తీసుకొచ్చారు.

ఇక్కడికి రాలేకపోయిన బంధుమిత్రులకోసం కొందరు, కొంపా గోడు కోసం మరికొందరు, చెట్టూచేమా పంటా పశువూ కోసం ఇంకొందరు ఆందోళన పడుతున్నారు.

దూరాన సముద్రం హోరుమని గర్జిస్తూ మరింత భయపెడుతూండటంతో గుండెలు అరచేత బట్టుకుని ఉన్నారంతా.

అవతల తుపాను తగ్గే సూచనలు కన్పించట్లేదు. ఇవతల మాత్రం ఆకలిమంటలు చెలరేగుతున్నాయి. అంతా ఆకలి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. పిల్లలు ఏడుస్తోంటే వారిని సముదాయించడానికి సతమతమవుతున్నారు తల్లులు.

మొదటి రోజున అందరికీ పులిహోర పొట్లాలు, నీళ్ళు, పాలు తెచ్చిచ్చారు. రెండోరోజు పాలు, రొట్టెలు, ఉప్మా పంచారు. ఇవాళ మూడోరోజు. అప్పుడే మధ్యాహ్నం ఒంటిగంట దాటుతోంది. ప్రభుత్వ సహాయకులుగాని, స్వచ్ఛంద సంస్థలు గాని అటు తొంగి చూళ్ళేదు.

"దీనమ్మ గాలి వాన తగ్గేట్టు లేదు..." ఎప్పుడో ఆరిపోయిన చుట్ట చీకుతూ అన్నాడు వీరయ్య.

"కళ్ళు చించుకున్నా బయటేమీ కన్పించట్లేదు. మనిషనేవాడు ఎలా రాగలడు?" ప్రశ్నించాడో యువకుడు.

"మరైతే మనకి పస్తేనా!" విచారంగా అంది ఒకామె.

ఎవరూ బదులు పలకలేదు. కాని ముసలివాళ్ళు గొణుక్కున్నారు. పిల్లల ఏడుపులు పెరిగాయి.

"అక్కడుంటే తుపాను సంపేత్తాదని భయపడి బతకడానికి ఈడకొత్తే, ఈడ ఆకలి సంపేసేట్టుందిరా దేవుడా!" ఒకావిడ వాపోయింది.

ఆవిడ వంక బాధగా, సానుభూతిగా చూశారు కొందరు.

ఇంతలో వనజ పొట్ట పట్టుకుని ఇబ్బంది పడుతూ వంకర్లు తిరిగిపోసాగింది.

"ఏవయ్యిందే. బయటి కెల్తావా?" తల్లి రత్తాలు అడిగింది.

తల అడ్డంగా ఊపింది.

"మరెందుకలా కిందా మీదా అయిపోతన్నావే. ఆకలేత్తందా?"

లేదన్నట్టు తలూపి తలొంచుకుంది.

పెదవి కొరుక్కుంటూ బాధ భరిస్తూండటం చూసేసరికి రత్తాలుకేదో అనుమానమొచ్చింది. "కొంపతీసి బయటయ్యావేంటే" చెవిలో అడిగింది.

అవునంటూ తల ఆడించింది.

"ఖర్మ! అదీ ఇప్పుడే వచ్చిపడాలా! ఇప్పుడెలాగే తల్లీ!" చుట్టూ చూసింది. పాత గుడ్డలేవీ కన్పించలేదు. లేచి వెళ్ళి బాత్‌రూంలోనూ ఇతర చోట్లా వెదకివచ్చింది.

"ఇదే దొరికింది" అంటూ పొట్లాలు చుట్టిన కాగితాలు అందిచ్చింది.

సిగ్గుతో చితికిపోతూనే గోడవైపు తిరిగి కాగితాల్ని తొడల మధ్య కుక్కింది.

కాస్సేపటిదాకా బాగానే ఉంది. ఆ తర్వాత అవీ తడిసిపోసాగాయి. తల్లివంక బేలగా చూసింది.

"ఇంకేం సెయ్యనే పిల్లా! నెల నెలా ఈ యాతన మనకే రావాల్నా కర్మ!" నుదురు కొట్టుకుంది రత్తాలు.

ఏంటేంటని ఆరాగా చూశారు ఆడవాళ్ళు. సైగల్తో చెప్పింది. బుగ్గలు నొక్కుకున్నారు. ఆపైన బాధగా భయంగా చూశారు.

"పెద్దోళ్ళైతే ఎలాగో సర్దుకుపోవచ్చు. పదిహేనేళ్ళ పిల్ల. మగాళ్ళమధ్యలోంచి ఎలా వెళ్తుంది. ఎక్కడి కెళ్తుంది!" చుట్టూ పరచుకుని ఉన్న జనాన్ని చూస్తూ అందొకామె.

"ఏదోటి సెయ్యకపోతే లేనిపోని రోగాలు రావూ!" సాగదీశారొకరు.

"మాయదారి గాలివాన ఎక్కడా తగ్గేట్టులేదు. ఏం సేయను, ఎంతకని సావను!" నిస్సహాయంగా అంది వనజ తల్లి రత్తాలు.

అంతలో ఏదో ఆలోచన రాగా, "మరుగు దొడ్లో కెళ్ళి కడుక్కురా. ఎక్కడా మసిగుడ్డలు కూడా లేవు. పోతే పోయింది. నీ వోణీని పెట్టేసుకో" అంది.

"హమ్మో!" రెండు చేతుల్తో వక్షాన్ని అదుముకుంటూ అంది వనజ.

**రంజని 2018 కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

# గోదానం

అపరాహ్ణవేళ.

స్వామికి ఉపచారాలు సమర్పించి, గుడి తలుపులు వేసి, ఇంటి ముఖం పట్టారు కృష్ణమాచార్యులు.

కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి వస్తోంటే ఆశగా చూసింది ఇల్లాలు. రొంటిన దోపుకున్న నాలుగు నాణాలు తీసి ఆమె చేతిలో వేశారు. కళ్ళతో గబగబా లెక్కించింది. మూడున్నర!

'ఇంతేనా!' అన్నట్టు చూసింది కాత్యాయని.

"భక్తులు ఇవాళెక్కువగా రాలేదు. అసలు ఊళ్ళోని జనమే తగ్గిపోయార్లే. అంతా పట్నాలకి వలసబోయే వాళ్ళే!"

"మనమూ ఆలోచిస్తే మంచిదేమో? ఎన్నాళ్ళిలా...!" ఆమె కన్నుల్లో కన్నీరు కదలబోయే ఆగింది. నట్టింట కన్నీరు ఒలికించరాదని ఆమె కళ్ళకు తెలుసు.

మౌనమూర్తిగా మారిపోయారు.

సుమారు ఇరవై ఏళ్ళ క్రితం ఆ ఊరి వేంకటేశ్వర స్వామి ఆలయానికి అర్చకుడిగా వచ్చారు. ఉండటానికి ఇల్లు ఇచ్చారు. జీతంతోబాటు పైరాబడీ బావుండేది. కళ్యాణాలూ ధనుర్మాసపూజలూ వివిధ ఉత్సవాలూ చక్కగా జరిగేవి. ఊళ్ళోని పెద్ద కుటుంబాల వారు వంతులేసుకుని పూజోత్సవాలు వైభవంగా జరిపించేవారు.

మెల్లగా ఊరి పరిస్థితి మారిపోయింది. ఉద్యోగాలు, వ్యాపారాలు అంటూ పట్నాలకి పోవడం ఎక్కువైంది. ఇక వ్యవసాయం కష్టాలూ నష్టాలూ మిగులుస్తోంది. గుడి ప్రాభవమూ కొడిగట్టింది. గుడికొచ్చే భక్తుల సంఖ్య నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అయిపోయింది.

ఒకప్పుడా ఊళ్ళో కొత్త పెళ్లి కూతురు తొలుత గుడికొచ్చి, స్వామిని దర్శించాకే అత్తింట అడుగుపెట్టేది. ఊళ్ళోకి బంధువులెవరొచ్చినా ఏదొక వేళ తప్పనిసరిగా గుడికొచ్చి స్వామి దర్శనం చేసుకునేవారు. ఇప్పుడదంతా నిన్నటి మాట అయిపోయింది.

తన పరిస్థితీ పూర్తిగా మారిపోయింది. మూడువేల జీతం తప్ప మరో ఆదాయం లేదు.

ఒకప్పుడు గౌరవమర్యాదలిచ్చిన ఊరు ఇప్పుడు తన ఉనికినే పట్టించుకోవట్లేదు!

తన కళ్ళ ముందే పౌరోహిత్యం ప్రారంభించిన రామశర్మ బిల్డింగు కట్టేశాడు. అతడిలా తనూ దిన కర్మలకీ తద్దినాలకీ వెళ్ళలేడు. పోనీ వ్రతాలూ పెళ్ళిళ్ళూ జరిపిద్దామా అంటే గుళ్ళో త్రికాల అర్చనలూ ఆరగింపులూ చెయ్యాలి.

మొదట్లో సత్యనారాయణ స్వామి వ్రతాలకి పిలిచేవారు. ప్రవచనాలు చెప్పించుకునే వారు. ముహూర్తాలు పెట్టించుకునేవారు. ఇప్పుడు ఊళ్ళో శుభాశుభకార్యాలన్నింటికీ శర్మ ఒక్కడే అల్లుకుపోయాడు.

అతడు మోపెడ్ మీద పొరుగూళ్ళకు సైతం రయ్ రయ్‌మని తిరుగుతోంటే, తను ఈగలు తోలుకుంటూ ఇంట్లో కూర్చుంటున్నాడు.

ఒక్కోసారి అర్చకత్వాన్ని వదిలేసి శర్మలా మారిపోదామా అన్పిస్తూ ఉంటుంది. కాని దేవుడి సేవ వదులుకోడానికి మనస్సు ససేమిరా అంటోంది.

'అన్నింటికీ ఆ దేవ దేవుడే ఉన్నాడు' అనుకుంటూ రోజుల్ని లాక్కొస్తున్నాడు.

కొడుకుని వేదపాఠశాలలో చేర్చాడు. అక్కడ ఫీజుల్లేకపోవటం, భోజనాది వసతులు ఉచితం కావడం ముఖ్యకారణం. ఎలాగో కూతురు పెళ్ళి చేసేశాడు. ఇక మిగిలింది తనూ భార్యా. తమ తనువులు వెళ్ళకపోతాయా అన్న ఆశ! ధీమా!

అదంతా నెమరేసుకుని గాఢంగా నిట్టూర్చారు.

మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ చిత్రంగా చూసింది కాత్యాయని.

"అలా ఉన్నారేం?"

"నారు వేసినవాడు నీరు పోయడంటావా!"

"నీరేవిటి పాలే పోస్తాడు. మీరు తాత కాబోతున్నారండీ..." సంబరంగా అంది.

ఆనందోద్విగ్నులయ్యారు. "నిజమా!"

"అవునండీ. ఇందాక సుబ్బయ్య వచ్చి చెప్పెళ్ళాడు. పాలకొల్లు సంతలో మన అల్లుడుగారు కన్పించి మనకి కబురందజేయమన్నారట"

ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. గుడివైపుకి తిరిగి దణ్ణం పెట్టారు.

"పురుటి ఖర్చు వచ్చిపడుతుందన్నమాట" దిగులుగా అన్నారు.

"అది తర్వాతి సంగతి. ముందెళ్ళి అమ్మాయిని చూసి రావాలి. రెండు మూడు రకాల మిఠాయిలూ, పండ్లూ తీసుకెళ్ళకపోతే బావుండదు..."

"చూద్దాంలే..." అని లేచారో లేదో, "ఆచార్యులు గారూ" అంటూ పిలిచాడు సన్యాసిరావు. అతడు దొరయ్యగారి పైపనులు చూస్తుంటాడు.

"ఏం సన్యాసీ... ఇలా వచ్చావేంటి"

"మా దొరయ్యగారు తమర్ని ఉన్న పళాన తీసుకురమ్మన్నారు..."

# స్వాతి వీక్లీ కథ కథ కథ కథ పోటీలో ఆర్కిటెక్ట్ అంశంలో బహుమతి పొందిన కథ

# పైకప్పు

"హంసినీ, త్వరగా రెడీ అవ్వు, పార్టీ కెళ్దాం"

"బర్త్ డే పార్టీకా!" గబుక్కున అంది మెరుస్తోన్న కళ్ళతో.

ఏడేళ్ళ హంసినికి పుట్టినరోజు వేడుకలంటే ఎంతో ఇష్టం. ఎందరో పిల్లల్తో కలిసి ఆడిపాడవచ్చని ఆశపడుతూంటుంది.

"కాదు గృహప్రవేశానికి" నెక్ టై కట్టుకుంటూ వచ్చి అన్నాడామె తండ్రి మనోజ్‌కుమార్.

"అది మామూలు గృహం కాదు, రాజభవనం. ఆ మాటకొస్తే దేవేంద్ర భవనం. మీ నాన్నే డిజైన్ చేశారు. ఆయన గొప్ప చూపించుకోడానికి మనల్ని తీసుకెళ్తున్నారు" భర్త వంక వోరగా చూస్తూ ఓరకంట నవ్వుతూ అంది సునంద.

"ఎన్నో గొప్ప గొప్ప భవనాలు డిజైన్ చేసిన ఆర్కిటెక్ట్‌ని. ఎన్నో అవార్డులూ సన్మానాలూ అందుకున్న వాణ్ణి. నేనేంటో డబ్బా కొట్టుకోవాల్సిన పనిలేదు" ఉక్రోషపడ్డాడు.

"వూరికే మిమ్మల్ని ఉడికించడానికన్నాను. నిజంగానే ఉడికిపోతున్నారు" నొచ్చుకుంది.

"భవన రూపశిల్పిగా నా స్థాయి సమున్నతమైంది. అమరావతిలో కొన్ని రకాల భవనాలకి నేను ఆకృతులిచ్చిన సంగతి నీకూ తెలుసుగా. అఫ్‌కోర్స్, ఆ ఘనతంతా కన్సల్టెంట్ ఖాతాలోకి వెళ్ళిందనుకో..."

"ఓకే. మీరు గ్రేట్ ఆర్కిటెక్ట్. ఒప్పుకుంటున్నాను. డాడీకి జేజేలు చెబుదామా హంసినీ"

"నేను చూడలేదుగా" బుంగమూతి పెట్టి అంది.

"చూడక్కర్లేదు. ఆ హంసభవన్ చాలా గొప్పగా ఉంటుంది. అందులో అడుగు పెట్టిన ప్రతీవారూ మహారాజు లేక మహారాణిలా ఊహించుకుని తీరతారు. తాజ్‌మహల్ వంక ఎంత అద్భుతానందంతో చూస్తారో అచ్చం అలాగే చూస్తారు" కించిత్తు గర్వంగా అన్నాడు తలెగరేసి మరీ.

"తాజ్‌మహల్ సమాధి మీద కట్టారు కదా డాడీ. ఇందులోనూ

సమాధులుంటాయా?"

"ఛాఛా... కోట్లకు పడగెత్తిన కుబేరులుంటారు. వారి బాత్ రూం మన ఇల్లు అంత ఉంటుంది తెలుసా?"

"బాపురే!" అరచేతుల్తో బుగ్గలు నొక్కుకుంటూ అంది హంసిని.

"ఆ చిత్ర విచిత్రాలన్నీ చూసి డాడీని అపర'మయుడు' అని పొగిడేద్దాం, త్వరగా తెములు మరీ..."

"మయుడెవరు మమ్మీ"

"మీ డాడీ లానే గొప్ప ఆర్కిటెక్ట్. మహాభారతంలో ధర్మరాజు రాజభవనం, మయసభ కట్టింది అతడే. అతడిలాగే మీ డాడీ కూడా ఎన్నెన్నో గొప్ప భవనాలకు రూపం పోస్తుంటారు"

అలాగా అన్నట్టు చూసి తలాడించింది హంసిని.

గబగబా రెడీ అయి వచ్చింది. ఆమె పరికిణీ జాకెట్టూ ధరించడం చూసి ముఖం ముడిచాడు మనోజ్. నొసలు చిట్లించి భార్య వంక చూశాడు.

"ఇదేం డ్రెస్సే పేరంటానికెళ్తున్నట్టు! సిటీలోని గొప్ప గొప్ప వాళ్ళంతా వస్తారు తెలుసా..." హంసిని రెక్క పట్టుకుని గదిలోకి లాక్కెళ్ళింది సునంద. ఆ దుస్తులు విప్పి కెరటాల డిజైన్ గల తెల్లని ఫ్రాక్ తొడిగింది.

"ఇప్పుడు దేవకన్యలా ఉంది మా హంసిని" మెచ్చుకున్నాడు.

"నాకదే బావుంది..."

"మనకి నచ్చటం ముఖ్యం కాదు హంసినీ. పదిమందిలోకి వెళ్తున్నప్పుడు పదిమందికీ నచ్చేలా మెప్పు పొందేలా ఉండాలి. నువ్వు ది గ్రేట్ ఆర్కిటెక్ట్ మనోజ్‌కుమార్ ఏకైక కుమార్తెవి. ఆ సంగతి కలలో కూడా మర్చిపోకు"

తండ్రి మాటలు సగమే అర్థమైనా తలాడించింది హంసిని.

మనోజ్, సునంద కారు ముందు సీట్లో కూర్చోగా, హంసిని ఒక్కతే వెనుక కూర్చుంది.

డోర్ గ్లాస్ కిందికి దించి బయటికి ఆసక్తిగా చూడసాగింది హంసిని.

రోడ్డు కిరుపక్కలా డేరాల్లాంటి ఇళ్ళున్నాయి. వాటి ముందు ఎన్నో రకాల మట్టిబొమ్మలు, ప్లాస్టిక్ పూలకుండీలు, ప్లాస్టరాఫ్ పారిస్ తో చేసిన రకరకాల డెకరేటివ్

# అమ్మకు బహుమతి

అనుకోకుండా వరుసగా మూడు రోజులు సెలవులొచ్చాయి.

"మనూరు వెళ్దామా అన్నయ్యా" అన్నయ్యకి ఫోన్‌లో ప్రతిపాదించాను.

"ఓకే. అమ్మకి చెప్పకుండా వెళ్ళి సర్ప్రయిజ్ చేద్దాం" అన్నాడు.

ఆ వెంటనే అక్కయ్యకి ఫోన్ చేసి సంగతి చెప్పాను.

"నేనూ వస్తాన్రా. ఈ బాదరా బందీలన్నీ వదిలేసి హాయిగా మనింట్లో ఈ మూడు రోజులూ ఎంజాయ్ చేద్దాం. చక్కగా రీచార్జి అయి తిరిగి వద్దాం" అంది ఉత్సాహంగా.

మేం తలొక చోట ఉంటున్నాం. అంచేత ముగ్గురం విజయవాడలో కలుసుకుని కారులో మా ఊరెళ్ళాం.

మా ముగ్గుర్నీ ఒకేసారి చూసి పరమానంద పడిపోయింది అమ్మ. సాధారణంగా మేం ఎవరికి వీలున్నప్పుడు వాళ్ళు వస్తూంటాం.

"కోడళ్ళనీ పిల్లల్నీ కూడా తీసుకు రావాల్సిందిరా. ఏకంగా పెద్ద పండగ ముందుగానే నడిచి వచ్చేది!" చేటంత ముఖం చేసుకుని సంబరంగా అంది.

"అప్పటికప్పుడు అనుకున్నాం అమ్మా. అంతా రావాలంటే రిజర్వేషన్లు ఓ పెద్ద తలనొప్పి వ్యవహారం. వాటితో పెట్టుకుంటే లాభం లేదని మేం బయల్దేరి వచ్చేశాం"

"పోనీలే, మీరైనా వచ్చారు" అంటూ మాకు కాఫీలిచ్చి అందరి యోగక్షేమాలూ పేరు పేరునా ఆరా తీసింది.

"నాన్న పొలం వెళ్ళారా" అన్నయ్య అడిగాడు.

"ఇది వరకు వరి పండించే వాళ్ళం గనుక ఏడాదికి నాలుగైదు నెలలు ఖాళీ ఉండేది. ఇప్పుడీ రొయ్యల చెరువులొచ్చి పడ్డాక ఇరవై నాలుగ్గంటలూ పనే అనుకో. చిన్నపిల్లల్ని సాకినట్లు సాకాల్సొస్తోంది. ఏమాత్రం తేడా వచ్చినా అవి తేలి, మనల్ని ముంచేస్తాయి!" అమ్మ నవ్వింది.

అమ్మ నవ్వు ఎంతో అపురూపంగా, మురిపెంగా అన్పించింది. "నీ నవ్వు భలే బావుంటుందమ్మా. కర్ణుడు కవచ కుండలాలతో పుట్టినట్టు నువ్వీ చిరునవ్వు ఆభరణంతో

పుట్టి ఉంటావు" అన్నాను.

"మొత్తానికి నా చిన్ని కొండవి అన్పించావు" అంటూ నా బుగ్గ పొడిచి పెద్దగా నవ్వింది.

ఇంతలో మా నాన్న వచ్చారు. మేం ఆయనతో కబుర్లలో పడ్డాం. అమ్మ వంట పనిలో పడింది. మధ్య మధ్యల్లో పాలేర్ని ఎక్కడెక్కడికో తరుముతూ హైరాన పడుతోంది. అక్క సాయం చేస్తానని వెళ్ళినా ఆ సామ్రాజ్యంలోకి అడుగు పెట్టనివ్వలేదు.

"తెల్లారి లేచింది మొదలు  పిల్లల రంధే తప్ప నీకు క్షణం తీరికుండదు పాపం. ఈ రెండ్రోజులైనా సరదాగా గడపవే, ఆటవిడుపుగా ఉంటుంది" అక్కతో అంది అమ్మ.

"అమ్మ ఎప్పుడూ ఇంతే. పెళ్లి కాకముందు అది చెయ్యి, ఇది నేర్చుకో అని వెంటబడేది. ఇప్పుడేమో రెస్టు తీసుకో అంటూ వంటింట్లోకే రానివ్వటం లేదు చూడు" వెనక్కొచ్చి నవ్వుతూ చెప్పింది అక్కయ్య.

"అప్పుడు నేర్చుకున్నావు గనుకే బావగారు నీ వంటని లొట్టలేస్తూ తింటున్నారు" అన్నాడు అన్నయ్య.

"ఆయనకి హోటల్ భోజనం బొత్తిగా నచ్చదన్నయ్యా"

అక్క మాటలకు, "నువ్వన్నీ కమ్మగా చేసి పెడుతోంటే ఇంకెలా నచ్చుతుందక్కా!" నవ్వాను.

అందరం భోజనానికి పీటలు వాల్చుకుని వరుసగా కూర్చున్నాం.

సున్నుండలు పెట్టింది. తీపి లేకుండా అమ్మ ఎప్పుడూ భోజనం వడ్డించదు.

బాగా కాచిన నెయ్యి పోసి చేసిందేమో సున్నుండలు కమ్మగా ఉన్నాయి. అన్నయ్యకి ఇంకోటి వేసి, "నీకు బాగా ఇష్టం. తినరా" అంది. మేం ముందే చేతులు అడ్డు పెట్టేశాం.

"చిన్నోడా, పెదతాతగారింటి నుంచి జున్ను పాలు తెప్పించాన్రా. సాయంత్రానికల్లా జున్ను వండేస్తాను" అంది.

ఎగిరి గంతేశాను. "నేనొచ్చినప్పుడల్లా ఎలావోలా జున్ను తినిపించక మానదు అమ్మ" అభిమానంగా చూస్తూ అన్నాను.

"చిన్నప్పుడు జున్ను వండితే చాలు అంతా నీకే కావాలని కూర్చునేవాడివి. ఎవరికీ పెట్టనిచ్చేవాడివే కాదు" మురిపెంగా అంది అమ్మ.

# దాహార్తి

'ఇక్కడ తెలుగు పద్యాలు ఉచితంగా నేర్పబడును' అని రాసివున్న చిన్న నోటీసు బోర్డుని మా గృహ సముదాయపు గేటుకి తగిలించాను.

ప్రతి ఆదివారం, పాఠశాల సెలవు దినాల్లోనూ ఆ పలకను వేలాడదీస్తుంటాను. తరచూ గాకపోయినా, అప్పుడప్పుడూ కొందరు పిల్లలు, పెద్దవారు వస్తుంటారు. వారి వారి భాషా జ్ఞానాన్ని బట్టి వేమన, సుమతీ శతకాల నుంచో, పోతన, కరుణశ్రీలవో పద్యాలు నేర్పుతాను. కేవలం కంఠస్తం చేయించడం కాదు, అర్థ తాత్పర్యాలూ వివరిస్తాను.

ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసి ఆరేళ్ళయ్యింది. అదిగో అప్పట్నుంచీ ఈ మహా నగరపు కీకారణ్యంలో స్థిరపడిపోయాను.

'హాయిగా పల్లెపట్టున పైరగాలి పీలుస్తూ ప్రకృతి ఒడిలో సేదదీరతాంరా'– అంటే మా అబ్బాయి ఒప్పుకోలేదు. అక్కడ వైద్య సౌకర్యం ఉండదన్చెప్పి ఇక్కడ మా కోసం అపార్టుమెంటు కొన్నాడు. అది కూడా నేల అంతస్తులోది.

ఎంచేతంటే మా ఆవిడ మోకాళ్ళ నొప్పులతో బాధపడుతోంది. మెట్లెక్కలేదు, దిగలేదు, నడవలేదు. అమెరికాలో ఉంటున్న మా అబ్బాయి ఇంకో ఆరు నెలల్లో వస్తాడు. అప్పుడు తల్లికి శస్త్రచికిత్స చేయిస్తానన్నాడు.

మా ఇంటావిడ పరిస్థితిలానే ఉంది తెలుగు భాష పరిస్థితీనూ. నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్టు అయిపోతోంది. తెలుగు మాట్లాడే వాళ్ళు తగ్గిపోతున్నారు. తెలుగులో చదివే వారిని కాగడా పట్టుకుని వెదకాల్సొస్తోంది. అందుకనే ఉడతాభక్తిగా తెలుగు పద్యాలు నేర్పే కార్యక్రమం పెట్టుకున్నాను.

అవడానికి మాది జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతమే అయినా మాటామంతీ చెప్పుకోడానికి మనుషులే దొరకరు. అందరివీ ఉరుకులూ పరుగులే. అందరి కాళ్ళకూ చక్రాలే!

ఎవరైనా ఆసక్తితో వస్తే తెలుగు, ఇష్టంగా మరింత ఇష్టం కలిగేలా బోధిస్తాను. సాయంత్రం వేళ గుడికెళ్ళి కూర్చుని నాబోటి వయో వృద్ధులతో కాలక్షేపం చేస్తుంటాను.

నేను పది మాటలు మాట్లాడితే అందులో ఎనిమిది తెలుగు గురించే ఉంటాయి. బంధుమిత్రుల ఇళ్ళకి వెళ్తే పిల్లల్ని తెలుగు పాటలూ పద్యాలూ పాడమంటూ ప్రోత్సహిస్తాను. అంచేత నన్నంతా తెలుగు పండితుడిగానే భావిస్తారు. మరెవరూ తెలుగు కోసం తాపత్రయ పడరని వారి భావమేమో తెలీదు.

ఇంట్లో కెళ్ళి అలా వాలుకుర్చీలో నడుం వాల్చానో లేదో ఒకావిడ ఒక చిన్న కుర్రాడితో వచ్చింది.

"ఇక్కడెవరో మాస్టారు ఉన్నారట..."

"నేనే, రండి... కూర్చోండి..."

నా వంక ఎగా దిగా చూసి లోపలి కొచ్చి కూర్చుంది. ఆమెకి ముప్ఫై ఏళ్ళు ఉంటాయి. బాగా చదువుకున్నదానిలానే ఉంది. ఆడంబరంగా ఉంది.

కుర్రాడికి మూడేళ్ళుంటాయేమో. బొద్దుగా ముచ్చటగా ఉన్నాడు. లేచి వెళ్ళి డబ్బాలోంచి నాలుగు బిస్కత్తులు తీసుకొచ్చాను. "రారా... తిను... నీ పేరేంటి?"

"చకిత్" సిగ్గుపడుతూ చెప్పాడు. అదేం పేరో మరి!

వాడు బిస్కత్తుల కోసం రాబోతోంటే, "నో. బ్యాడ్ మ్యానర్స్" అంది. ఆగిపోయాడు. కాని ఆశగా చూస్తున్నాడు. దగ్గరికెళ్ళి అందిచ్చాను. గబుక్కున తీసుకుని నోట్లో కుక్కుకున్నాడు.

వాడి వంక కోపంగా చూసి, నా వంక ముఖం చిట్లించి చూసింది.

"ఇలాంటివి ఎంకరేజ్ చెయ్యకూడదు. బై ద వే. వీడు మా సన్. టూ ఇయర్స్ సెవెన్ మంత్స్ ఓల్డ్. ఇంటర్నేషనల్ స్కూల్లో అడ్మిట్ చేద్దామని ఎంక్వైర్ చేశాం అంకుల్. నేమ్, పేరెంట్స్ నేమ్స్, కొన్ని రైమ్స్ వస్తే గాని అడ్మిషన్ ఇవ్వరట. మీరు టూ ఆర్ త్రీ రైమ్స్ నేర్పాలి..."

"క్షమించాలి. నేను ఆంగ్లం బోధించను"

"ఏం? మీకు రాదా?" ఆమె మాటల్లో కించిత్తు వ్యంగ్యం చోటు చేసుకుంది.

చిన్నగా నవ్వాను. "డబుల్ ఎమ్మే. హైస్కూల్ రిటైర్డ్ హెడ్మాస్టర్ని..."

ఆమె ముఖం కొంచెంగా ఎర్రబడింది. "మీ ఫీజు ఎంతైనా ఫరవాలేదు, పే చేస్తాను. మా వారు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!"

"అది గ్రహించాను, కాని అక్షరాన్ని అమ్ముకునేవాణ్ణి కాదు. చిట్టీ చిలకమ్మ, చందమామ రావే- లాంటి చక్కని పిల్లల పాటలెన్నో ఉన్నాయి. తేలికగా అర్థం చేసుకుంటారు. సునాయాసంగా నేర్చుకుంటారు. అవి నేర్పమంటే నేర్పుతాను..."

ఆమె అందమైన ముఖం కాస్తా వికృతంగా మారిపోయింది.

"తెలుగెవడిక్కావాలీ! మీకు తెలీదేమో. ఎల్కేజీ నుంచి పీజీ దాకా ప్రతి క్లాసూ ఇంగ్లీషు మీడియంలో చదవకపోతే ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఎల్కేజీ క్లాసు క్కూడా చెప్పనివ్వరు! అదీ వాళ్ళ స్టాండర్డు! దాన్ని అందుకోవాలంటే ఎంత ఇంగ్లీషు రావాలీ!"

మా ఇంటి హాలు గోడలకు తెలుగు వర్ణమాల, బొమ్మల పదాల పట్టిక, వివిధ కాయగూరల, పండ్ల, జంతువుల, ఆటల, వృత్తుల చార్టులు వరుసగా వేలాడదీసి

# జీవనయాగం

"రండి మేడమ్..."

కారు దగ్గరి కెళ్ళి ఆహ్వానించింది ఆశ్రమ నిర్వాహకురాలు శాంత. ఆమె వెంట మరికొందరు కార్యకర్తలూ ఉన్నారు.

ఖరీదైన కారులోంచి హుందాగా దిగింది వసుంధర.

"ప్రముఖ వ్యాపారవేత్త ఆకాశమూర్తిగారి భార్యగారు...వసుంధరాదేవిగారు..." కార్యకర్తలకు పరిచయం చేసింది శాంత.

పట్టుచీర, యు కటింగ్ జుట్టు, మెడలో వజ్రాల నెక్లెస్, ఫుల్ మేకప్‌తో అధికారాల్లేని జమిందారిణిలా ఉన్న ఆమె వంక ఆరాధనగా చూశారు. అభిమానంగా చూశారు కార్యకర్తలు.

ఆ పైన ముకుళిత హస్తాలతో మందహాసాలతో స్వాగతించారు.

వారి వంక చూసి, విడీ విడని పెదాలతో నవ్వీ నవ్వనట్టు నవ్వి చిన్నగా తల పంకించింది. తను ఇంట్లోనే 'తన'లా ఉంటుంది. బయటకొస్తే చాలు ఆకాశమూర్తి భార్యగానే ప్రవర్తిస్తుంది. అలా ఉండాలన్నది అతగాడి ఆదేశం.

వారి వెంట ఆశ్రమంలోకి నడిచింది వసుంధర.

ఆవిడ లేడీస్ క్లబ్ సెక్రటరీ. ఒకసారి శాంత వారి క్లబ్బుకొచ్చి తమ ఆశ్రమం గురించీ, చేస్తున్న సేవల గురించీ చాలా చెప్పుకొచ్చింది.

ఆశ్రమానికి ఆర్థిక సాయం అందిస్తే బావుణ్ణనిపించి క్లబ్ అధ్యక్షురాలితో మాట్లాడింది వసుంధర.

"అలాంటివి మనకెక్కడ కుదుర్తాయీ! వచ్చే నెలలో 'మిస్ సిటీ' అందాల పోటీలు నిర్వహించాలి. ఆ తర్వాత క్లబ్ యాన్నివర్సరీ గ్రాండ్‌గా చెయ్యాలి. ఈ మధ్యలో కేంద్రమంత్రి రమామణి సిటీకెప్పుడొస్తే అప్పుడు ఆవిడ్ని ఘనంగా సన్మానించాలి..."

"వీళ్ళెక్కువగా ఆశించట్లేదు..."

"ముందలాగే అంటారు గానీ... నువ్వంతగా చెబుతున్నావు గనుక ఏదైనా జయంతికో వర్థంతికో పండ్లూ మిఠాయిలూ పంచి ఫొటోలు దిగుదాంలే..."

ఆవిడలా అనాసక్తంగా మాట్లాడేసరికి మరి రెట్టించలేకపోయింది. ఆ ముక్క శాంతకి చెప్పలేక "తీరిక చేసుకుని ఓసారొచ్చి మీ కార్యక్రమాలు చూస్తాన్లే" అని చెప్పి పంపేసింది

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ammaku+Bahumati**

* * *